ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు

మంగళవారం 16 సెప్టెంబరు 2025



అతిథి ఉపాధ్యాయులకు గౌరవ వేతనం విడుదల

బెంగళూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక, హైస్కూళ్లలో పని చేసే అతిథి ఉపాధ్యాయులకు గౌరవ వేతనం మొత్తాన్ని విడుదల చేశారు. 2025 జూన్ నుంచి సెప్టెంబరు వరకు రూ.20,41,620 హైస్కూల్ ఉపాధ్యాయులకు 2025 జూన్ నుంచి నవంబరు వరకు రూ.7,12,425 విడుదల చేశారు. ఈ మేరకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఆర్థికశాఖ గ్రాంట్లుగా నేరుగా సంబంధిత తాలూకా పంచాయతీలకు విడుదల చేసిందని, వెంటనే తాలూకా పంచాయతీ గ్రాంట్లలో డీడీఓ లాగిన్ అయి జాప్యం కాకుండా చెల్లించాలని విద్యాశాఖ అధికారులు సూచించారు.



సకులం



- 22నుంచి రాష్ట్రవ్యాప్తంగా కులగణన ● జియోట్యాగ్ ఆధారంగా ఇంటింటి సర్వే
- డిసెంబరు చివరి నాటికి పూర్తి నివేదిక ● 60 ప్రశ్నలతో సమగ్ర సమాచార సేకరణ
- మొబైల్, రేషన్‌కార్డు, ఆధార్ అనుసంధానం ● 1.75 లక్షల మంది ఉపాధ్యాయులు.. రూ.420 కోట్ల ఖర్చు

7 కోట్ల మంది వివరాలు తేలనున్నాయ్

రాష్ట్రంలో ఉన్న దాదాపు 7కోట్లమంది ప్రజల సమగ్ర వివరాలను సర్వే ద్వారా సేకరించనున్నారు. 2 కోట్ల ఇళ్లనుంచి గణాంకాలు సేకరించనున్నారు. 1.55 కోట్ల ఇళ్లకు (యూహెచ్ఐడీ) యూనిక్ హౌస్‌హోల్డ్ ఐడింటిఫికేషన్ నెంబరును ఆధారం చేయనున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ ప్రయోజనాలతోపాటు ప్రభుత్వం అమలు చేసే ఏఏ పథకాలలో లబ్ధిదారులుగా ఉన్నారనేది కూడా సర్వేలో ప్రత్యేకమైన ప్రశ్నగా ఉంది. గ్యారెంటీ పథకాల్లో గృహజ్యోతి, గృహలక్ష్మి, యువనిధి, అన్నభాగ్య, శక్తి గ్యారెంటీలతోపాటు ఏ విధంగా ప్రభుత్వ సేవలు పొందుతున్నారనేది నమోదు చేసుకోనున్నారు. సమాజంలో కులాలమధ్య బేధాభిప్రాయాలు ఉన్నాయి. అదే అసమానతకు కారణంగా ఉంది. అందరికీ సమాన అవకాశాలు, సామాజిక న్యాయం కల్పించాలని రాజ్యాంగంలో రూపొందించారు. అందుకు అనుగుణంగానే సర్వే ఉండాలని ముఖ్యమంత్రి ఇటీవల ఉన్నతాధికారులను ఆదేశించారు. సమానత్వంలో బేధాభిప్రాయాలు ఉండకూడదని, గ్యారెంటీ పథకాలను అందరికీ వర్తింపచేస్తున్నామన్నారు. కానీ బీపీఎల్ కుటుంబాల సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు సీఎం సూచించారు.

బెంగళూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణనకు మరో వారం రోజులే గడువు ఉంది. ఈ సర్వేలో కులాలు, ఉపకులాలు, ఆర్థిక స్థితిగతులు, పథకాల అర్హతలు తదితర పూర్తి వివరాలు తెలియనున్నాయి. ఈనెల 22నుంచి అక్టోబరు 7వ తేదీ వరకు సామాజిక, విద్య (కులగణన) సర్వే చేయదలిచారు. జియోట్యాగ్ చేసిన 2 కోట్లకుపైగా ఇళ్లను సందర్శించి 7కోట్లమంది ప్రజల సామాజిక, విద్య స్థితిగతులకు సంబంధించి గణాంకాలను సేకరించేందుకు బీసీ కమిషన్ సిద్ధమైంది. రాష్ట్రంలో అందరి వివరాలు సర్వే ద్వారా సేకరించనున్నారు. డిసెంబరులోగా నివేదిక సమర్పించాలని బీసీ కమిషన్‌కు ప్రభుత్వం గడువు విధించింది. దీంతో కమిషన్ సాంకేతిక రీతిలో సర్వేకు సిద్ధమవుతోంది. ఇంటింటా సమీక్ష జరిపేందుకు వ్యూహాలు సిద్ధం చేశారు. అవసరమైతే మరింత గ్రాంటు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

దసరా సెలవులే సరైన సమయం

దసరా పండుగ సందర్భంగా పాఠశాలలకు సెలవులు ఉన్నందున ఇదే సరైన సమయమని, రెండు నెలలక్రితమే ప్రభుత్వం నిర్ణయించింది. 1.75 లక్షలమంది ఉపాధ్యాయులను కులగణన సర్వేకు నియమించుకోవాలని తీర్మానించారు. మొత్తం 60 ప్రశ్నల ద్వారా గణాంకాలను సేకరించదలిచారు. సమీక్ష ప్రక్రియను రేషన్‌కార్డులు, ఆధార్‌సంఖ్యను మూల ఆధారంగా పరిగణించదలిచారు. సమీక్షకోసం పనిచేసే ఉపాధ్యాయులకు గౌరవవేతనం రూపంలో రూ.320 కోట్లు ఖర్చు కానుందని అంచనా వేశారు. సర్వేకు మూడు రోజుల ముందే ఈనెల 19న 60 ప్రశ్నలతో కూడిన నమూనాను ఆశా కార్యకర్తలు ఇళ్లకు చేరుస్తారు. వారికి 2వేల రూపాయలు ప్రోత్సాహకం ఇవ్వనున్నారు. కులగణనకు రూ.420కోట్లు ఖర్చు కానుందని అంచనా వేశారు.

ఒక్కటి కానున్న 93 ఉపకులాలు

1978 నుంచి ఇప్పటివరకు ఒక్కలిగ ఉపకులాలు వెనుకబడిన కేటగిరీలో ఉన్నాయి. ఒక్కలిగ కులంలో 93 ఉపకులాలు ఉన్నాయి. వీటన్నింటిని ఒక్కటిగా చేర్చనున్నారు. అందరినీ ఒక్కలిగగా పరిగణించాలని సంఘం ప్రతిపాదించింది. ఇప్పటికే 1400 కులాల జాబితాలో 73 ఉపకులాలు ఉన్నాయి. మరో 19 ఉపకులాలు కమిషన్ జాబితాలో చేర్చాలనే డిమాండ్ ఉంది. లింగాయత సామాజికవర్గం నుంచి పలు కులాలు దూరమయ్యే అవకాశాలు ఉన్నా యి. లింగాయత -జవలి, లింగాయత-పట్టసాలి, లింగాయత - హండేవజీర, లింగాయత-కబ్బలిగరు, లింగాయత - కరిగాణిగరు, లింగాయత - శెట్టరు/కోరి శెట్టరు/ కోరి, లింగాయత - జాడశివాచార, లింగాయత - మాలి, లింగాయత - డోహరు, లింగాయత - చమ్మారరు, లింగాయత - కొరమరు, లింగాయత - హోలెయరు, లింగాయత - శీలవంతరు, లింగాయత - హండే కురబరు, లింగాయత-దాసరు/చిన్నదాసరు, లింగాయత - మఠపతి, లింగాయత - గంపణ, లింగాయత - మళ్లేరా, లింగాయత - వీర మాహేశ్వర, లింగాయత - శివపూజె లాంటి కులాలు లింగాయత సమాజం నుంచి దూరం కాదలిచారు.

విద్యుత్ మీటర్ ఆధారంగా జియోట్యాగ్



ప్రతి ఇంటి విద్యుత్ మీటరు ఆధారంగా జియోట్యాగ్‌కు ప్రత్యేకమైన సంఖ్యను నమోదు చేస్తున్నారు. ఇప్పటికే 1.55 కోట్ల ఇళ్లకు యూహెచ్ఐడీ సంఖ్యల స్టిక్కర్‌లను అమర్చారు. విద్యుత్ కనెక్షన్ లేని ఇళ్లను కూడా సర్వే చేస్తారు. సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, ఎవరూ సర్వేకు దూరంగా ఉండకూడదని బీసీ కమిషన్ కసరత్తు చేస్తోంది. కులగణన సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, అందరి వివరాలు సేకరించదలిచారు. అందుకే 60 ప్రశ్నలతో నమూనాను సిద్ధం చేశారు. ఎక్కడా పొరపాట్లుగా నమోదు చేసేందుకు వీలు లేకుండా ప్రతి పాయింట్‌కు మరోపాయింట్ అనుసంధానం చేస్తూ వచ్చారు.

కులం పేరుకు ప్రాధాన్యం ఇవ్వండి

- సంఘాల నాయకుల డిమాండ్

కులగణన సర్వేకు రోజులు సమీపిస్తున్న తరుణంలో కులసంఘాల పెద్దలు వారి సమాజంలో చైతన్యం తీసుకొచ్చేందుకు సిద్ధమయ్యారు. సభలు, సమావేశాలు, పత్రికా ప్రకటనల ద్వారా కులసభ్యులను ఐక్యం చేసేలా సిద్ధమయ్యారు. యాదవ కులంలో గొల్లలతోపాటు పలు ఉప కులాలు ఉన్నాయి. వారంతా ఒకే కులం కిందకు తీసుకురావాలని నిర్ణయించారు. కమ్మ సమాజానికి చెందిన వారిలోనూ నాయుడు, చౌదరితోపాటు పలువురు ఉన్నారు. వీరంతా జాబితాలో కమ్మ పేరు నమోదు చేయాలని చైతన్యం కల్పిస్తున్నారు. ప్రతిరోజూ వివిధ కుల సంఘాలు చైతన్యం తీసుకొచ్చేందుకు కసరత్తు జరుపుతున్నారు. ఇప్పటికే మాధ్యమాల ద్వారా పిలుపునిస్తున్నారు.

పదేళ్లనాటి సర్వే అనుభవాలు

2015లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం సిద్దరామయ్య నేతృత్వంలో తొలిసారి కులగణన సర్వే జరిగింది. సామాజిక, ఆర్థిక, విద్య పరమైన వివరాలు సేకరణతోపాటు ఏఏ కులాలలో ఎంతమంది జనాభా ఉన్నారనేది స్పష్టత కోసం సర్వే చేశారు. 2018లో కాంగ్రెస్ ప్రభుత్వం గడువు ముగిసేసరికి దాదాపు సర్వే ముగిసింది. అయితే ఆ తర్వాత జేడీఎస్-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం 18 నెలల పాలనలోగానీ, ఆ తర్వాత మూడున్నరేళ్ల బీజేపీ పాలనలో కులగణన నివేదికను స్వీకరించేందుకు వారు ముందుకు రాలేదు. 2023 లో మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీసీ కమిషన్ నుంచి నివేదికను స్వీకరించారు. కేబినెట్‌లో ఆమోదించేందుకు సిద్ధమయ్యారు. అయితే రాష్ట్రంలో ప్రధానమైన లింగాయత, ఒక్కలిగ కులాల జనాభా తగ్గిందని సంబంధిత కులపెద్దలు, స్వామిజీలు సర్కారుపై తిరగబడ్డారు. కేబినెట్‌లోనే సంబంధిత కులాల మంత్రులు సైతం నివేదికను వ్యతిరేకించారు. దీంతో అధిష్టానం జోక్యం చేసుకుని పదేళ్లకిందటి సర్వేను ఆమోదించలేమని మెలిక పెట్టి తిరస్కరించారు. అప్పట్లో మేం సర్వేలో పాల్గొనలేదని మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబీకులతోపాటు పలువురు ప్రముఖులు ఆరోపించారు. ఇలాంటి విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే ఈ సారి ఎలాంటి పొరపాట్లు లేకుండా సమగ్ర సర్వే చేపట్టాలని నిర్ణయించారు.

వీల్ చెయిర్‌లోనే పార్లమెంటుకు వెళ్తా



రాజకీయాల నుంచి రిటైర్ కాను : మాజీ ప్రధాని దేవెగౌడ

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలనుంచి రిటైర్డు అయ్యేది లేదని, ప్రస్తుతం 93ఏళ్ల అని ఆరోగ్య సమస్యలు ఉన్నాయని అయినా వీల్ చెయిర్‌లోనే పార్లమెంటుకు వెళ్తానని మాజీ ప్రధాని దేవెగౌడ అన్నారు. హాసన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చెన్నై - బెంగళూరు నేషనల్ ఎక్స్‌ప్రెస్ వే, బెంగళూరు - హైదరాబాద్ హైవేల ప్రాధాన్యత ప్రధానమంత్రికి వివరించానని, వచ్చే బడ్జెట్‌లో ఎక్కువ గ్రాంట్లు రానున్నాయన్నారు. కావేరి, కృష్ణా నదుల నీటి కేటాయింపులు, రోడ్ల విస్తరణ అవసరమన్నారు. అస్కర్ ఫెర్నాండెజ్ కాలంలో శిరాడిఘాట్ వద్ద సొరంగమార్గం నిర్మించాలని ప్రతిపాదనలు సూచించానని, అయితే ఇప్పటికీ సాధ్యం కాలేదన్నారు. వయసు పైబడినా రాజకీయ ప్రయోజనాలకోసం మాట్లాడనన్నారు. 65ఏళ్ల పాటు రాజకీయ జీవనంలో కొనసాగానని, రాష్ట్ర అభివృద్ధికి శక్తికి మించి పోరాటం చేశానన్నారు.



డప్పు వాయించి ప్రజాస్వామ్య దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న సీఎం



బైక్ ర్యాలీలో డీసీఎం డీకే శివకుమార్

ఓటు చౌర్యం సమంజసం కాదు : సీఎం

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓటుచౌర్యం సమంజసం కాదని రాజ్యాంగబద్ధంగా ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండాలని, అందరికీ సమాన అవకాశాలకు ఇదే ఆశయమని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విధానసౌధ తూర్పుద్వారం వద్ద బైక్‌ర్యాలీని సీఎం లాంఛనంగా ప్రారంభించారు. డీసీఎం డీకే శివకుమార్, బీడీఏ చైర్మన్ హ్యారిస్‌లు బుల్లెట్‌లపై వెళ్లారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప, మంత్రి మునియప్పతోపాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం బ్యాంక్వెట్‌హాల్‌లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవ సభలో సీఎం మాట్లాడుతూ దేశంలో కుల వ్యవస్థతోనే అసమానత కొనసాగుతోందన్నారు. దేశంలో అందరికీ సామాజిక, విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం లభించినప్పుడే సమానత్వం సాధ్యమవుతుందన్నారు. ఓటుచౌర్యం రాజ్యాంగాన్ని దుర్బలం చేసే కుట్ర అన్నారు. ప్రజాస్వామ్యంలో అన్ని కులాలు, మతాలు సమానమన్నారు. మతోన్మాదాన్ని అందరూ ఖండించాలన్నారు. రాజ్యాంగ ఆశయాలు అందరికీ సమానంగా అందాలన్నారు.

రైల్వేశాఖ ఆధ్వర్యంలో

హిందీ దివస్

- అడ్డుకున్న కరవే కార్యకర్తలు
- బ్యానర్లు చించేసి, షీల్డుల ధ్వంసం

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో రైల్వేశాఖ హిందీ దివస్‌ను నిర్వహిస్తుండగా కరవే కార్యకర్తలు అడ్డుకున్నారు. సోమవారం కార్యక్రమం జరుగుతున్న ప్రదేశానికి వెళ్లిన కార్యకర్తలు అక్కడి బ్యానర్లను చించేసి, షీల్డులను ధ్వంసం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు అక్కడనుంచి నిష్క్రమించారు. దీంతో పరిస్థితి తారస్థాయికి చేరింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పలువురు మహిళా కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. హిందీ దివస్ ఆచరణను రద్దు చేయాలని కార్యకర్తలు బైఠాయించారు. కార్యక్రమం నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. కన్నడిగులు ఎవరూ లేరని, న్యాయం చేయాలంటూ ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి అధిక పన్నులు చెల్లించేది కన్నడిగులని, మీ భాషా ప్రాబల్యం పెంచుకునే ప్రయత్నాలు చేయరాదని హెచ్చరించారు.

ముగ్గురు యువతుల ఆత్మహత్యాయత్నం

- ఒకరి మృతి, ఇద్దరి పరిస్థితి విషమం ● రాయచూరు జిల్లాలో విషాదం



రేణుకమ్మ (ఫైల్)

రాయచూరు సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవదుర్గ తాలూకా కె. ఇరబగేరా గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు యువతులు ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. అందులో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. ఈ సంఘటనతో సోమవారం గ్రామంలో విషాదం నెలకొంది. ఒకే కుటుంబానికి చెందిన రేణుకమ్మ(18.), సునితా(17), తిమ్మవ్వ(24) పురుగుల మందు తాగి, సమీపంలోని బావిలోకి దూకారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకోగా అందులో రేణుకా అక్కడికక్కడే మృత్యువాత పడగా మిగిలిన సునితా, తిమ్మవ్వ అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వీరిద్దరికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సనందించి మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చనిపోయిన రేణుకకు ఇటీవలే పెళ్లి నిశ్చయం కాగా, తాను ప్రేమించిన యువకుడితో పెళ్లి జరపని కారణంగానే ఆ అమ్మాయి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. మరో ఇద్దరు అదే కుటుంబానికి చెందిన వారు, సమీప బంధువులే అయినా ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డారో అంతుపట్టడం లేదు. కోలుకుంటున్న వారిలో తిమ్మవ్వ పరిస్థితి విషమంగా ఉంది. సునిత క్రమంగా కోలుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కోలుకున్న సునిత నుంచి పూర్తి సమాచారం తెలియాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు. ఘటనా స్థలాన్ని దేవదుర్గ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మంజునాథ ఎస్ పరిశీలించారు. దేవదుర్గ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.



చికిత్స పొందుతున్న తిమ్మవ్వ



ఒడ్డుకు చేరుకున్న బోటు

క్షేమంగా చేరారు..

- సముద్రంలో బోటు ఇంజన్ ఫెయిల్ ● రాత్రంతా జల్లాల్లోనే..
- ఒడ్డుకు చేర్చిన అలలు ● 13 మంది మత్స్యకారులు సురక్షితం

బెంగళూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా పరిధిలో ఉల్లాళ నుంచి సముద్రంలో చేపలవేటకు వెళ్లిన బోటు ఇంజన్ ఫెయిల్ అయ్యింది. భారీ అలలమధ్య 13మంది మత్స్యకారులు చిక్కుకున్నారు. ఉల్లాళ పట్టణం మహ్మద్ అశ్వాక్‌కు చెందిన బురాక్ ట్రాలర్ బోట్‌లో అరేబియా సముద్రంలో కేరళవైపు చేపలవేటకు వెళ్లారు. ఆదివారం అర్ధరాత్రి ఇంజన్ ఫెయిల్ అయ్యింది. అందులో 13మంది మత్స్యకారులు ఉన్నారు. వారు ఇంజన్ మరమ్మతులు చేసేందుకు ప్రయత్నించారు. లోతైన సముద్రం కావడం, మరోవైపు కనుచూపు మేర ఇతర బోట్‌లు లేకపోవడంతో ప్రాణాలు అరచేతబట్టుకుని రాత్రంతా గడిపారు. అలలధాటికి సోమవారం తెల్లవారుజామున ఉల్లాళ పరిధిలోని జావా సీ గ్రౌండ్ ప్రాంతానికి బోట్ వచ్చింది. సముద్రపు ఒడ్డుకు చేరేసరికి మత్స్యకారులంతా ఊపిరి పీల్చుకున్నారు. తెల్లవారుజామున వారంతా ఒడ్డుకు చేరుకున్నారు. ప్రమాదంలో బోటుకు నష్టం జరిగినట్లు బోటు యజమాని తెలిపారు. ఈమేరకు ఉల్లాళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రాజకీయాల్లోకి సీఎం మనవడు..!

- వరుణ నుంచి బరిలోకి ధవన్..! ● పట్టుబడుతున్న అభిమానులు



సిద్దరామయ్యతో మనవడు ధవన్ రాకేశ్

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలలోకి వారసులు రావడం కొత్తేమి కాదు. అయితే వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా మాట్లాడే సీఎం సిద్దరామయ్య మరో వారసుడు రాజకీయాలలోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు చర్చలు జోరందుకున్నాయి. ఇప్పటికే సిద్దరామయ్య కుమారుడు డాక్టర్ యతీంద్ర వరుణ నుంచి ఓసారి ఎమ్మెల్యేగా కొనసాగి, ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. అయితే సీఎం మనవడు ధవన్ రాకేశ్‌ను రాజకీయాల్లోకి తీసుకొచ్చే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. సిద్దరామయ్య రాజకీయ వారసుడిగా పెద్ద కుమారుడు రాకేశ్‌ను రాజకీయాల్లోకి తీసుకురావాలని ప్రయత్నించారు. అయితే రాకేశ్ అకాలమరణం చెందిన విషయం తెలిసిందే. ఆ తర్వాతనే యతీంద్రను రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. సిద్దరామయ్య మరోసారి పోటీ చేసే ఆలోచనలో లేనట్లు తెలుస్తోంది. గత ఎన్నికల వేళ వరుణ నియోజకవర్గంలో ఇవే చివరి ఎన్నికలని ప్రకటించారు. నామినేషన్ సమయంలోనూ ధవన్ రాజకీయాల్లోకి వస్తారని ప్రస్తావించిన విషయం కూడా ఉంది. మారుతున్న రాజకీయాలలో రిటైర్డు అయ్యేది లేదని ఇటీవలే ప్రకటించారు. ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న వరుణ నుంచి మనవడు ధవన్‌ను పోటీ చేయించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. వరుణలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో రాకేశ్‌ను కాంగ్రెస్ నాయకులు స్మరించారు. ఇదే సందర్భంలోనే పలువురు నాయకులు ధవన్‌ను రాజకీయాలలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇలా ధవన్ రాజకీయ ప్రవేశానికి అడుగులు పడుతునట్లు తెలుస్తోంది. అదే జరిగితే మరో కుటుంబం నుంచి వారసుడు రాజకీయాల్లోకి ప్రవేశించే అవకాశం ఉంది.

హరిత విప్లవం స్థాయిలో ఆహార ఉత్పత్తి జరగలేదు: సీఎం 7లో

విశ్వఖ్యాతి ఆయన సొంతం

- నిర్మాణాలతోనే ప్రపంచ ప్రసిద్ధి పొందారు
- మోక్షగుండం జయంతి సభలో డీసీఎం

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక యుగంలో ఎన్నో ఆవిష్కరణలు సాధ్యమయ్యాయని అయితే దశాబ్దాల క్రిందటే దేశంలో ఎన్నో విజయాలను సాధించి సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ప్రపంచ ప్రసిద్ధి చెందారని డీసీఎం డీకే శివకుమార్ అన్నారు. సర్ ఎం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని సోమవారం కేఆర్ సర్కిల్‌లో సర్ ఎం విశ్వేశ్వరయ్య విగ్రహానికి ఆయన నివాళి అర్పించారు. ఇంజనీర్లు జాతి నిర్మాణ చర్యలలో కీలకులని డీసీఎం అన్నారు. దేశ భవిష్యత్తుకు పునాది వేయడంలో వారి బాధ్యత మహత్తరమైనదన్నారు. ఇంజనీర్ల సమాఖ్య అధ్యక్షుడు ఎం నాగరాజు, సహ అధ్యక్షుడు వెంకటశివారెడ్డి, ప్రధాన కార్యదర్శి కేటీ నాగరాజుతో పాల్గొన్నారు.



విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డీసీఎం డీకే

పొలికేక ఢిల్లీకి వినిపించాలి

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): 'అనంత ప్రజల పొలికేక ఢిల్లీకి వినిపించాలి. ఆర్డీటీకి విదేశీ విరాళాల నియంత్రణ చట్టం(ఎఫ్‌సీఆర్‌ఏ)ను రెన్యువల్ చేయాలి' అని ఆర్డీటీ లబ్ధిదారులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎస్సీ, ఎస్టీ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో పొలికేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీగా ప్రజలు తరలివచ్చారు. ఆర్ట్స్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు సాగిన భారీ ర్యాలీతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ర్యాలీ అనంతరం కలెక్టరేట్ వద్ద ఉన్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అఖిలపక్ష కమిటీ నాయకులు డాక్టర్ అక్కులప్ప, బీసీఆర్ దాస్, సాకేహరి, యల్లన్న, ఉమామహేశ్వరి మాట్లాడారు. ఆరు దశాబ్దాల ఆర్డీటీ ప్రయాణంలో అనంతపురం ఉమ్మడి జిల్లాకు ఎంతో మంచి జరిగిందన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టేలా కుంటలు, చెక్‌డ్యాంలు ఆర్డీటీవారు నిర్మించారన్నారు. ఉపాధి మార్గాలు చూపి, ఉచిత విద్య, వైద్యం అందించిందని కొనియాడారు. ఇలా పేద కుటుంబాల్లో వెలుగులు నింపిన ఆర్డీటీకి ఆర్థిక వనరులు స్తంభింప చేయడం దారుణమని మండిపడ్డారు. ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే రెన్యువల్ చేయాలన్నారు. ప్రతి గ్రామం, వీధి నుంచి వేలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చినా ప్రభుత్వాలకు కనువిప్పు కలగకపోతే భవిష్యత్ ఉండదని హెచ్చరించారు. పొలికేక కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మకు వినతిపత్రం అందించారు. పొలికేకకు మద్దతుగా బహుజన లాయర్స్ ఫోరం(బీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప ఆధ్వర్యంలో న్యాయవాదుల జేఏసీ తరలివచ్చి సంఘీభావాన్ని తెలిపింది. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, శ్రీనివాసులు, రామాంజనేయులు, అంజి, కుళ్లాయప్ప, సూరి, దొడ్డప్ప, బానాసీశీన, రామకృష్ణ, హరిగోపాల్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.



బారికేడ్లను తోసుకుని వస్తున్న జనం, కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన జనసందోహం

ఇబ్బంది పడాల్సిందే..



మా ఊర్లో తాగడానికి నీళ్లులేవు. దీంతో చెర్లోపల్లికి వెళ్లి తెచ్చుకుంటున్నాం. మా ఊర్లోనే ఫిల్టర్ ట్యాంక్ కట్టిస్తామని ఆర్డీటీ చెప్పింది. ప్రస్తుత ఇబ్బందులతో డబ్బులు లేక ఫిల్టర్ ట్యాంక్ కట్టడంలేదు. స్కూల్ కట్టించినా ఓపెన్ చేయడంలేదు. ఆర్డీటీలేకుంటే ఇబ్బందులు పడాల్సిందే.

-మాలేపల్లి మహిళలు, కుందుర్పి మండలం

ఇల్లు కట్టించారు



మాకు సొంత ఇల్లు కట్టించారు. పొదుపు సంఘంలో రుణాలిచ్చారు. నా కుమారుడు డిగ్రీ, ఇద్దరు కుమార్తెలు ఇంటర్మీడియేట్ చదివారు. వారి విద్యకు ఆర్డీటీనే ఆర్థిక సాయం చేసింది. ఐదో తరగతి వరకు ఆర్డీటీ పాఠశాలలోనే చదివారు. మాలాంటి పేదలకు ఆర్డీటీనే దిక్కు. ప్రభుత్వం కరుణించి ఆర్డీటీని కాపాడాలి.

-రామలక్ష్మి, కొడపగానిపల్లి, కొత్తచెరువు మండలం

రుణాలు ఇచ్చారు



పదిమంది మహిళలను ఒక పొదుపు సంఘంగా ఏర్పాటు చేసి రుణాలిచ్చారు. దాని ద్వారా గేదెలు, గొర్రెలు పెంచుకుని డబ్బులు సంపాదించేవాళ్లం. చేన్లలో కుంటలు తవ్వించి, చెక్‌డ్యాంలు కట్టారు. గవర్నమెంట్ రూమ్‌ల కంటే మంచి ఇళ్లను ఆర్డీటీ కట్టించింది. ఇప్పుడేమి పనులు చేయడంలేదు.

-పెద్దక్క, లక్షుంపల్లి, పెద్దవడగూరు మండలం

ఐదుగురిని చదివించింది



నాకు ఐదుగురు పిల్లలుంటే వారందరినీ ఆర్డీటీనే చదివించింది. అన్నం కూడా ఆర్డీటీ స్కూల్లోనే పెట్టేవారు. ఒక ఎకరా భూమి లేని మాలాంటి పేదలకు చదువులు, ఆస్పత్రులు, కూలి పనులు అన్నీ ఆర్డీటీనే చూసుకుంది. ఇప్పుడు మూసివేస్తే ముందు తరాలు ఏమికావాలి.

-లక్ష్మక్క, మాలేపల్లి, కుందుర్పి మండలం

15 మందికి ఉద్యోగాలు



నా కొడుకును ఆర్డీటీనే ఇంజనీరింగ్ చదివించింది. కుమార్తెను బీఫార్మసీ చదివిస్తోంది. ఆర్డీటీ చదివించిన 15మంది పిల్లోళ్లు మా ఊర్లో ఉద్యోగాలు సాధించారు. ఒక పిల్లోడు డాక్టర్ అయినాడు. పొదుపు సంఘంలో రుణాలు ఇచ్చినారు. పాడి ద్వారా ఉపాధి పొందడానికి గేదెలు ఇచ్చారు. ఆర్డీటీ లేకుంటే మేములేము.

-అక్కమ్మ, బొందలవాడ, నార్పల మండలం

ఆర్డీటీని దూరం చేస్తున్నారు..



పొదుపు సంఘంలో ఉన్నవారికి రూ.25వేల చొప్పున రుణం ఇచ్చారు. గ్రామ స్వరాజ్యం కింద 79మందికి రూ.20వేల ప్రకారం బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్‌లాగా చేశారు. ఆ డబ్బులు అట్లే ఉంటాయి. వడ్డీ మాత్రమే వాడుకుంటాం. చేన్లో పంటపెట్టుకునేకి రాళ్లు ఏరివేసే పేరుతో డబ్బులు ఇస్తున్నారు. పెట్టుబడికి వినియోగించుకుని పంట వచ్చినప్పుడు కడుతున్నాం. పిల్లోళ్లకి బియ్యం, బాళ్లు, గోధుమలు, నూనే, దుస్తులు అన్నీ ఇస్తున్నారు. అలాంటి ఆర్డీటీని మాకు దూరం చేయాలని చూస్తున్నారు.

-పాలవెంకటాపురం మహిళలు, బ్రహ్మసముద్రం మండలం

వానవాన వొద్దప్పా..!

- కొన్ని రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు
- తీవ్రంగా నష్టపోతున్న వేరుశనగ రైతులు
- కట్టె, కాయలు నల్లగా మారుతున్నాయని ఆందోళన

కంబదూరులో తొలగించిన వేరుశనగ కట్టె అంతా నల్లగా మారిన దృశ్యం



కళ్యాణదుర్గం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాలతో అన్నదాత తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. కోతకోసిన పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నాడు. ఖరీఫ్ ఆరంభానికి ముందే బారుబావుల కింద వేరుశనగ సాగుచేశారు. పంట కాలం పూర్తవడంతో వేరుశనగను తొలగించారు. అయితే వర్షాలు తెరిపిలేకుండా కురుస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలా వర్షాలు వస్తే పంట తొలగించకపోతే భూమిలోపల ఉన్న కాయలు మొలకలు వస్తాయి. తొలగిస్తే వేరుశనగ కట్టె, కాయలు నల్లగా మారి బూజు పట్టే ప్రమాదం ఉంది. ఎటు చూసినా రైతుకు నష్టమే. దీంతో వానదేవుడా కొన్నాళ్లు వానకు రెస్ట్ ఇవ్వవయ్యా స్వామి అని ఆకాశంలోని మబ్బుల వైపు చూసి వేడుకుంటున్నారు. నియోజకవర్గంలో సుమారు 1200 ఎకరాలకు పైబడి వేరుశనగ సాగు చేశారు. ఈ సారి వేరుశనగ క్వింటా ధర రూ. ఆరు వేల నుంచి రూ. ఏడువేల దాకా పలుకుతోంది. దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో ఉంది. అయితే గత కొన్ని రోజులుగా జడివాన కురుస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వేరుశనగ కట్టె, కాయలు పనికిరాకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులే..: రాజప్ప, వేరుశనగ రైతు, కంబదూరు



గత కొన్ని రోజులుగా కురిసిన వర్షానికి తొలగించిన వేరుశనగ కట్టెకు తేమశాతం అధికం అవుతోంది. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధిక తేమశాతంతో వేరుశనగ కట్టె అంతా నల్లగా మారిపోయింది. దాంతో పాటు తొలగించిన కట్టెకు మొలకలు వస్తున్నాయి. ఈ తేమశాతం పూర్తిగా పోవాలంటే ఎండ వేడిమి అధికం కావాలి. అప్పటివరకు ఈ కష్టాలు తప్పవు. నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. సుమారు రూ. 1.2 లక్షల దాకా పెట్టుబడి పెట్టా. ఈ అధిక వర్షాలతో నష్టాలు తప్పేలా లేవు.

కోలుకునేది ఎలా..?

భారీగా తగ్గిన టమోటా ధర

నెల కిందట 25కిలోల బాక్స్ రూ.800

నేడు రూ.150 నుంచి రూ.200 కూడా కష్టమే

నష్టాల్లో రైతులు



యాడికిలో స్టేకింగ్ పద్ధతిలో సాగుచేసిన టమోటా



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధం చేసిన టమోటా బాక్స్‌లు

యాడికి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు నేలచూపులు చూస్తున్నాయి. నెలకిందటి వరకు మంచి లాభాలు ఇచ్చిన టమోటా ప్రస్తుతం అన్నదాతను ఏడిపిస్తోంది. నెల కిందట 25కిలోల బాక్స్ గరిష్ఠంగా రూ.900 ధర పలికింది. అదే నేడు రూ.150 నుంచి 200 పలికేది కూడా కష్టంగా మారింది. మండలంలో యాడికి, రాయల చెరువు, లక్షుంపల్లి, వెంగన్నపల్లి, చందన, దైవాలమడుగు తదితర గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో రైతులు టమోటా సాగు చేశారు. పంటలు ప్రస్తుతం కోతదశలో ఉన్నాయి. ఇలాంటి సమయంలో ధరలు పడిపోవడంతో సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన పెట్టుబడి

ఎకరా పొలంలో టమోటా పంట సాగు చేయడానికి రూ.70వేల నుంచి రూ.90వేల వరకు ఖర్చు చేయాల్సి వచ్చిందని తెలిపారు. స్టేకింగ్ పద్ధతిలో టమోటా సాగుకు రూ.1.5లక్షలకు పైగా ఖర్చుచేస్తున్నారు. పెట్టుబడికి తగ్గట్లు పంట దిగుబడి చాలా బాగా వచ్చిందని, ధరలే దారుణంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. 100 బాక్స్‌ల టమోటాలకు 20బాక్స్‌లు సూట్ ఇవ్వాల్సి వస్తోందని, దీంతో కూలీల ఖర్చు, రవాణా ఖర్చులకే పంట దిగుబడి సరిపోతోందని పలువురు రైతులు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు పంట దిగుబడిని పొలంలో నుంచి బయటకు తీయలేకపోతున్నామని తెలిపారు. దీంతో తోటల్లోనే టమోటా మాగిపోతున్నాయని తెలిపారు. మండలంలో టమోటా దిగుబడిని రైతులు నంద్యాల జిల్లా ప్యాపిలి, అనంతపురం, గుత్తి, తాడిపత్రి వంటి మార్కెట్లకు తరలించి, విక్రయిస్తారు. టమోటా స్టాక్ ఎక్కువ వచ్చిన సమయంలో నోసేల్ బోర్డులు పెడుతున్నారని దీంతో చేసేదేమిలేక వారు అడిగిన ధరలకే అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు తెలిపారు. దీంతో రవాణా ఖర్చులు కూడా రావడం లేదని వాపోతున్నారు.

ఇటీవల వర్షాలకు తీవ్ర నష్టం

గత మూడు వారాలుగా తెరిపిలేని వర్షాలు కురవడంతో టమోటా పంటకు తీవ్ర నష్టం కలిగింది. ప్రతిరోజూ వర్షం కురుస్తుండటంతో పొలంలో టమోటా కాయలను కోసి మార్కెట్‌కు తరలించలేకపో తున్నారు. దీంతో తోటల్లో టమోటాలు మాగిపోయి పంట నష్టపోవాల్సి వచ్చిందని పలువురు రైతులు తెలిపారు. అలాగే వర్షాల వల్ల ఇతర రాష్ట్రాలకు టమోటా ఎగుమతి జరగకపోవడంతో ధరల పతనం మొదలైనట్లు రైతులు తెలిపారు.

ఎగుమతులు లేకనే...



1.5ఎకరాల్లో స్టేకింగ్ పద్ధతిలో టమోటా సాగుచేశా. ఎకరాకు రూ.1.6 లక్షల వరకు పెట్టుబడి వచ్చింది. దిగుబడి బాగా వచ్చిన ధరలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల టమోటాలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి కావడం లేదు. దీంతో ధరలు బాగా తగ్గిపోయాయి. రైతులకు పెట్టుబడి కూడా వచ్చే అవకాశాలు లేవు. -మధుసూదన్‌రెడ్డి, టమోటా రైతు

బాక్స్ రూ.200 పలకడం లేదు



స్టేకింగ్ పద్ధతిలో రెండు ఎకరాల్లో టమోటా సాగుచేశా. మూడు లక్షల పెట్టుబడి పెట్టా. దిగుబడి బాగా వచ్చింది. అయితే టమోటా బాక్స్ ధర రూ.200 కూడా పలకడం లేదు. ధరలు ఇలాగే కొనసాగితే తీవ్రంగా నష్టపోవాల్సిందే. వర్షాల ప్రభావంతో మార్కెట్‌లో వ్యాపారుల ఇష్టానుసారంగా టమోటా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. టమోటాకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపట్టాలి.

-రమేష్, టమోటా రైతు

పెట్టుబడి కూడా రాదు



రెండు ఎకరాల్లో పంట సాగుకు సుమారు రూ.1.8లక్షలు పెట్టుబడి పెట్టా. దిగుబడి బాగున్నా, ధరలు లేవు. ఫస్ట్ గ్రేడ్ టమోటా 15కిలోల బాక్స్ నెల కిందట రూ.800 ధర పలికింది. ప్రస్తుతం రూ.200 కూడా పలకడం లేదు. ఈ ధరలు కూలీలు, రవాణా ఖర్చులకే సరిపోతాయి. రైతులకు పెట్టుబడి కూడా రాదు. వర్షాలతో టమోటా ఎగుమతి లేకపోవడమే ధరలు పడిపోవడానికి ముఖ్యకారణం.

-శేఖర్, టమోటా సాగురైతు, రాయలచెరువు

ఇళ్లలో నీటి ఊట

- ఆందోళనలో బెళుగుప్ప గ్రామస్థులు



గదిలో ఉన్న ఊటనీరు



బెళుగుప్పలో ఊటనీటిని మోటార్లతో బయటకి పంపిస్తున్న దృశ్యం



చేతిపంపు నుంచి ఉబికి వస్తున్న నీరు

బెళుగుప్ప, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో మండల కేంద్రంలో మునుపెన్నడూ చూడనివిధంగా ఊట నీరు ఎక్కువైంది. ప్రతి ఏటా వ్యవసాయ బోరుబావుల్లో నీటి మట్టం తగ్గి పంటల సాగు చేసుకోలేక రైతులు ఇబ్బంది పడేవారు. ఈ ఏడాది మాత్రం భారీ వర్షాలతో ఎక్కడ చూసినా నీరు పుష్కలంగా లభిస్తోంది. బెళుగుప్పలో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోనే నీరు ఊరుతోంది. గ్రామానికి అరకిలోమీటర్ దూరంలో ఉన్న మంగోటి చెరువుకు ఈ ఏడాది జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణ జలాలు పుష్కలంగా వదిలారు. అలాగే నాగుల చెరువు భారీ వర్షాలకు నిండిపోయింది. దీంతో గ్రామం లో భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. చేతిపంపుల నుంచి కూడా భూగర్భజలాలు రేయింబవళ్లు బయటకు వస్తున్నాయి. వ్యాపార సముదాయాలు, ఇంటి సెల్లార్లలో నీరు ఊరుతుండటంతో వాటిని మోటార్ల ద్వారా బయటకి తోడేస్తున్నారు. ఊటనీటితో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో, ఏ ఇల్లు కూలుతుందోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడూ నీరు ఉండటంతో విషపురుగుల సంచారం ఎక్కువైందని, ఇలాంటి పరిస్థితి గ్రామంలో గతంలో ఎన్నడూ చూడలేదని, వేసవి వచ్చేవరకు ఈ ఇబ్బందులు తప్పవని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భయమేస్తోంది



మా ఇంటి పక్కన పది అడుగుల లోతులో ఊట నీరు నిల్వ ఉంది. మునుపెన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు. ఇళ్లలోని నీటిని మోటార్లతో తరలిస్తున్నా, కొద్దిసేపటికే మళ్లీ నీటి ఊటతో నిండిపోతోంది. ఎప్పుడు ఏమి ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో బతుకుతున్నాం.

-శివశంకర, బెళుగుప్ప గ్రామం



గ్రామ సమీపంలోని నాగులచెరువు

పోలీసుల ఒత్తిడితో గుండెపోటు

అనంతలో గిరిజనుడి మృతి

మృతదేహంతో స్టేషన్ వద్ద బాధితుల ఆందోళన

శింగనమల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు, జూదరులతోపాటు ఆ ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లిన ఓ గిరిజనుడి సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. ఉదయాన్నే స్టేషన్‌కు రావాలని సూచించారు. దీంతో రాత్రంతా ఒత్తిడికి లోనైనా ఆ వ్యక్తి.. ఉదయం స్టేషన్‌కు వెళ్లేందుకు గడప దాటగానే కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. పోలీసుల కారణంగానే నిండు ప్రాణం బలైందని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గ కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు, శింగనమల మండలం నాగులగుడ్డం తండాలో పేకాట ఆడుతున్నట్లు ఆదివారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ విజయ్ కుమార్ తన సిబ్బందితో తనిఖీలకు వెళ్లారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని, ఆ ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లిన రామకృష్ణ నాయక్(38)ను పట్టుకున్నారు. నలుగురి సెల్‌ఫోన్‌లను లాక్కుని, ఉదయాన్నే శింగనమల పోలీస్ స్టేషన్‌కు రమ్మని సూచించి వెళ్లిపోయారు. దీంతో రామకృష్ణ తీవ్ర ఆందోళనకు లోనయ్యాడు. రాత్రంతా నిద్రలేకుండా గడిపాడు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లేందుకు సోమవారం ఉదయం సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో ఒత్తిడికి లోనై గడప దాటగానే పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే శింగనమల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు సీపీఆర్ చేశారు. అయినా ప్రాణాలు నిలవలేదు. గుండెపోటు కారణంగా మృతిచెందాడని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలియగానే బాధితుల బంధువులు, తండావాసులు, టీడీపీ, వైసీపీ నాయకులు ఆస్పత్రికి చేరుకున్నారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐ కౌలుట్లయ్య అక్కడికి వెళ్లి బాధితులతో చర్చించారు. విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అయినా బాధితులు శాంతించలేదు. మృతదేహాన్ని స్ట్రెచర్‌పై పెట్టుకుని పోలీసు స్టేషన్ వద్దకు తీసుకెళ్లి ధర్నా చేశారు. రామకృష్ణ నాయక్ టీడీపీ కార్యకర్త కావడంతో శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు, పార్టీ సీనియర్ నాయకులు మారుతినాయుడు, గుత్తా ఆదినారాయణ, గుర్రం లక్ష్మీనారాయణ, సత్తి, అనిల్, మాసూల చంద్ర తదితరులు బాధిత కుటుంబం తరఫున పోలీసులతో చర్చలు జరిపారు. బాధిత కుటుంబానికి పరిహారం ఇస్తామని సీఐ హామీ ఇచ్చారు. మృతుడి భార్యకు తండాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టును ఇప్పిస్తామని టీడీపీ నాయకులు హామీ ఇచ్చారు. దీంతో తండావాసులు రామకృష్ణ మృతదేహాన్ని అక్కడి నుంచి తీసుకువెళ్లారు. తండాలో రామకృష్ణ చిన్నపాటి దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందేవాడు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు.



శింగనమల పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రామకృష్ణ నాయక్ కుటుంబ సభ్యులు, తండావాసులు

విచారణకు ఆదేశించిన ఎస్పీ: రామకృష్ణ నాయక్ మృతిపై ఎస్పీ జగదీశ్ విచారణకు ఆదేశించారు. పోలీసుల ఒత్తిడి కారణంగానే రామకృష్ణ నాయక్ మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగడంతో ఎస్పీ స్పందించారు. డీఎస్పీ స్థాయి అధికారిచేత పాదరర్శకంగా విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు.

పరామర్శించిన ఎమ్మెల్యే: రామకృష్ణ నాయక్ మృతి గురించి టీడీపీ నాయకులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే మృతుడి కుటుంబ సభ్యులను ఫోన్ చేసి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందజేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

ఎంఎస్ సుబ్బులక్ష్మి (జయంతి)



'భారతరత్న' పురస్కారం అందుకున్న తొలి భారతీయ కళాకారిణి, ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు మధురై షణ్ముఖవడివు (ఎంఎస్) సుబ్బులక్ష్మి 1916 సెప్టెంబరు 16న తమిళనాడు రాష్ట్రం మధురైలో జన్మించారు. సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ వద్ద సంగీతంలో శిక్షణ పొంది తన ప్రతిభకు స్పష్టమైన రూపు ఇచ్చారు. 1974లో రామన్ మెగసెసె పురస్కారం పొందారు. ఆధ్యాత్మిక గానంలో ఆమె శైలి విశిష్టమైనది. ప్రత్యేకించి భజన గీతాలకు ప్రాణం పోశారు. సంగీత కళానిధి, పద్మభూషణ్, పద్మవిభూషణ్, కాళిదాస్ సమ్మాన్, ఇందిరాగాంధీ జాతీయ సమైక్యతా అవార్డు, పలు గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. 2004 డిసెంబరు 11న పరమపదించారు.

పి.చిదంబరం (పుట్టినరోజు)



దేశ ప్రముఖ రాజకీయ నాయకుల్లో ఒకరైన పళనియప్పన్ చిదంబరం 1945 సెప్టెంబరు 16న జన్మించారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా నాలుగుసార్లు వ్యవహరించారు. అంతేకాక ఇంటెరిమ్ డిప్యూటీ లీడర్ ఆఫ్ అపోజిషన్‌గా 2022 నుంచి 2023 వరకు వ్యవహరించారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ హోమ్ అఫైర్స్‌కు చైర్మన్‌గా కొనసాగారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదిగా, హైకోర్టులలోనూ సీనియర్ న్యాయవాదిగా వ్యవహరించారు. పలు రకాల అంశాలపై పత్రికల్లో వ్యాసాలు రాశారు. పుస్తకాలు కూడా రాశారు.

ప్రసూన్ జోషి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత ప్రసూన్ జోషి 1971 సెప్టెంబరు 16న ఉత్తరాఖండ్ రాష్ట్రం అల్మోరా ప్రాంతంలో జన్మించారు. స్క్రీన్ రైటర్‌గా, లిరిసిస్ట్‌గా, కవిగానే కాక మార్కెటింగ్‌లోనూ సత్తా చాటుకున్నారు. ఎంసీ కెన్ వరల్డ్ గ్రూప్ సీఈఓగా, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌కు చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. మూడుసార్లు ఉత్తమ గేయ రచయిత్రిగా ఫిల్మ్‌ఫేర్, రెండు సార్లు నేషనల్ ఫిల్మ్ అవార్డ్ ఫర్ బెస్ట్ లిరిక్స్ అందుకున్నారు.

రేపటి నుంచి జాతీయ ర్యాంకింగ్

వీల్‌చెయిర్ టెన్నిస్ పోటీలు

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక వీల్‌చెయిర్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలిసారి జాతీయస్థాయి వీల్‌చెయిర్ టెన్నిస్ పోటీలు ఈనెల 17 నుంచి జరగనున్నాయి. దేశంలోని క్రీడలలో కొత్త అధ్యయనం సూచించినట్టు అవుతుందని నిర్వాహకులు ప్రకటించారు. గ్రేటర్ బెంగ ళూరు అథారిటీ (జీబీఏ) కమిషనర్ మహేశ్వర్‌రావు, క్రీడలు యువ జనులశాఖ కమిషనర్ చేతన్‌లు పోటీలను ప్రారంభిస్తారని అధ్యక్షుడు బీఆర్ చంద్రకాంత్ తెలిపారు. కబ్బన్‌పార్కు స్టేడియంలో పోటీలు జరగనున్నాయి.

యత్నాళ్ రాకను అడ్డుకోవాలని వినతి

రాయచూరు సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్వేష పూరిత ప్రసంగాలతో శాంతిభద్రతలకు సమస్యగా మారే ప్రసంగాలు చేస్తున్న బిజాపూర్ శాసన సభ్యుడు బసనగౌడ పాటీల్ యత్నాళ్ జిల్లాలోకి ప్రవేశించకుండా నిషేధం విధించాలని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) నాయకులు కోరారు. సోమవారం జిల్లా ఎస్పీ పుట్టమాదయ్యను కలిసి నాయకులు వినతి పత్రం ఇచ్చారు. గతంలో పలు సందర్భాల్లో ఆయన చేసిన ప్రసంగాల వల్ల అక్కడి ప్రజల మధ్య విద్వేషాలు తలెత్తి శాంతి భద్రతలకు సమస్యగా మారిన పలు ఉదహారణలను ఎస్పీకి వివరించారు. ముస్లిం మహిళల మనోభావాలు దెబ్బతినే రీతిలో ఆయన చేస్తున్న ప్రసంగాలు అనేక సందర్భాల్లో వివాదాస్పదమైయ్యాయన్నారు. తొలి నుంచి సమైక్యంగా సామరస్యంగా మెలుగుతున్న రాయచూరు జిల్లాలో అలాంటి వ్యక్తుల ప్రసంగాల వల్ల ప్రజల మధ్య విద్వేషాలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

నివేశ స్థలాల కోసం గ్రామస్థుల ఆందోళన



వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

రాయచూరు సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సువర్ణ గ్రామ పథకం ద్వార ఎంపిక చేసిన లబ్దిదారులకు నివేశన స్థలాలు ఇవ్వకుండా జరుగుతున్న జాప్యం పై గ్రామస్థులు ఆగ్రహించారు. పంచాయతీ అధికారుల తీరును నిరసిస్తు సోమవారం జిల్లాలోని అరకెరా తాలూకా క్యాదిగేరా గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. 2007 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం సువర్ణ గ్రామ పథకం ద్వార గ్రామంలోని బీపీఎల్ కార్డుదారులను గుర్తించి 9 ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తుల ద్వార సేకరించి ఇళ్ల స్థలాలకు సిద్ధం చేసిందరన్నారు. ఇప్పటి వరకు నిరుపయోగంగా ఉన్న ఆ భూమిలో నివేశన స్థలాల కోసం ప్లాట్‌లుగా విభజించినా లబ్దిదారులకు ఇవ్వడం లేదంటు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ స్థలం ఇప్పటివరకు గవర్నర్ పేరుతోనే రిజిస్టరై ఉందని ఆ స్థలాన్ని తమకు నివేశన స్థలాలుగా ఇవ్వాలంటు ఎంపికైన లబ్దిదారులు డిమాండ్ చేశారు. కాగా ఈ సందర్భంగా మాట్లాడిన తాలూకా పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి పొలాన్ని అధికారికంగా లేఔట్‌లు చేశామని ప్లాట్‌లుగా విభజించి ఇప్పటికే నెంబర్ల గుర్తింపు వేశామన్నారు.

హరిత విప్లవం స్థాయిలో ఆహార ఉత్పత్తి జరగలేదు

» ధారవాడ కృషి మేళాలో సీఎం సిద్దరామయ్య



స్టాల్‌ను వీక్షిస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విప్లవం హరితవిప్లవం స్థాయిలో ఆహార ఉత్పత్తి కావడం లేదని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. సోమవారం ధారవాడ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కృషి మేళాను సీఎం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ల్యాబ్ టు ల్యాండ్‌తోపాటు ల్యాండ్ టు ల్యాబ్‌వైపు కూడా దృష్టి సారించాలని సూచించారు. దశాబ్దాలకిందట వ్యవసాయానికి సంబంధించి సలహాలు ఇచ్చేందుకు గ్రామ సహాయకులు ఉండేవారని, వారు పల్లెల్లో



కృషి మేళాలో మహిళా రైతులకు సన్మానం

నివసించేవారన్నారు. ఆ తరహాలో వ్యవసాయ ఉద్యోగులను నియమించాలని వ్యవసాయశాఖ మంత్రికి సీఎం సూచించారు. సాగుభూమి పెరిగిందని, అయితే జనాభా కూడా పెరిగిందనేది గుర్తుంచుకోవాలన్నారు. వర్షాలతో పంటనష్టంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సీఎం సూచించారు. వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి, ధారవాడ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సంతోష్‌లాడ్, పరిషత్‌సభాపతి బసవరాజ హొరట్టి తదితరులు పాల్గొన్నారు. ఆదర్శ మహిళా రైతులను ముఖ్యమంత్రి సత్కరించారు.

ఇంజనీర్లకు మార్గదర్శకుడు విశ్వేశ్వరయ్య

» పద్మవిభూషణ్ డాక్టర్ వీకే అత్రె



సదస్సును ప్రారంభిస్తున్న ఎంఆర్ సీతారాం, డాక్టర్ వీకే అత్రె తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంజనీర్లకు మార్గదర్శకులు భారతరత్న సర్ ఎం విశ్వేశ్వరయ్య అని రక్షణమంత్రి మాజీ సాంకేతిక సలహాదారుడు పద్మవిభూషణ్ డాక్టర్ వీకే అత్రె అభిప్రాయపడ్డారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సర్ ఎం విశ్వేశ్వరయ్య జయంతిని జరిపారు. బెంగళూరు ఇండియన్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్, గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామయ్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్విరాన్‌మెంట్ అండ్ గ్రీన్ ఎనర్జీ పేరిట సదస్సు జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ ఎన్‌వీఆర్ నాయుడు, గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎంఆర్ సీతారాం, డాక్టర్ గోపాలకృష్ణన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఆర్ సీతారాం మాట్లాడుతూ మనం భూమిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి చర్య భూమి, పర్యావరణంను రక్షించుకునే మార్గం కావాలన్నారు. పర్యావరణ సంరక్షణకు రామయ్య విద్యాసంస్థలు పలు సుస్థిరమైన కార్యక్రమాలు కొనసాగిస్తోందన్నారు. బెంగళూరు ఐఐఎస్‌సీ క్లైమేట్, సాగర విజ్ఞాన కేంద్రం ప్రాధ్యాపకులు పీఎన్ వినయ్‌చంద్రన్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ శ్రీశారావ్‌లు భాగస్వామ్యులయ్యారు. సాంకేతిక అంశాలపై సుదీర్ఘమైన చర్చ జరిగింది. నగరంలోని ఏడు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు చర్చాగోష్టిలో పాల్గొన్నారు. నలుగురు విద్యార్థులకు నగదు బహుమతులను ప్రదానం చేశారు.

రామయ్య అప్లైడ్ సైన్సెస్‌లో...

రామయ్య యూనివర్సిటీ అప్లైడ్ సైన్సెస్ టెక్నాలజీ క్యాంపస్‌లో సోమవారం ఇంజనీర్స్ డేను ఏర్పాటు చేశారు. యాక్సెలర్ వెంచర్స్ కో-ఫౌండర్ సీఈఓ గణపతి వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ అడ్వైజర్ పుష్పతినాథ్ రజదాన్, వైస్ చాన్స్‌లర్ కుల్‌దీప్ కుమార్ రైనా, ప్రొఫెసర్ ఆర్‌వీ రంగనాథ్, డీన్ శరత్‌కుమార్‌లు పాల్గొన్నారు. గణపతి వేణుగోపాల్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు కొత్త అంశాలకోసం అన్వేషిస్తారని, కానీ ఇంజనీర్లు ఆలోచనలను వాస్తవానికి అనుగుణంగా పరివర్తన కల్పిస్తారన్నారు. ఇలా జాతినిర్మాణాన్ని ఇంజనీర్లు ఏర్పాటు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. యూరోస్కూల్ చిమ్నిహిల్స్ దీక్ష పీయూ కళాశాల, బి-ఫార్మసీ విద్యార్థులు, ఉపాధ్యాయులు రామయ్య విద్యాసంస్థలలో క్యాంపస్‌టూర్ చేశారు. కంప్యూటర్ సైన్స్ ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, మెకానికల్, రోబోటిక్స్ వివిధ విభాగాలను విద్యార్థులు సందర్శించి వాటి ప్రాధాన్యతను అడిగి తెలుసుకున్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

» సబ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్

శిడ్లఘట్ట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని టౌన్ ఎస్సై వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్యారగన్ స్కూల్‌లో సోమవారం మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ నేటి యువతను జల్సాలు, అర్ధరాత్రి పార్టీలు నాశనం చేస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. చదివే వయసులో దారి తప్పితే పరిస్థితి ఇలాగే ఉంటుందన్నారు. మాదకద్రవ్యాల సేవనం, చెడు అలవాట్ల వల్ల ఆర్థికంగా, మానసికంగా దెబ్బతింటారన్నారు. మాదకద్రవ్యాల విక్రయం, తరలింపు వంటివి చట్ట వ్యతిరేకమన్నారు. వీటిపై జాగృతి కల్పించేలా పాఠశాల, కళాశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది అశ్వథ్, సునీల్, సంపత్, కెంపరాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎస్ఐ వేణుగోపాల్

లక్ష్యం, ఏకాగ్రతతో చదవాలి

» ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ గోపాలన్ జగదీశ్

చిక్కబళ్ళాపుర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒక ఉన్నత లక్ష్యం ఎంచుకుని అందుకు ఏకాగ్రతతో చదవాలని బెంగళూరు ఐఐఎస్‌సీ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ గోపాలన్ జగదీశ్ అభిప్రాయపడ్డారు. పట్టణ శివారులోని నాగార్జున కాలేజ్‌లో ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం తరగతులను సోమవారం లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఇంజనీర్స్ డే రోజున కార్యక్రమం చేపట్టడం సముచితమన్నారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య కేవలం ఇంజనీర్ మాత్రమే కాదని ఆర్థిక నిపుణుడు కూడా అని బ్యాంకును కూడా స్థాపించారన్నారు. ఆయన సేవలు ఎంత కొనియాడినా తక్కువేనన్నారు. భావి ఇంజనీర్లకు విశ్వేశ్వరయ్య స్ఫూర్తిదాయకులన్నారు. జీవితంలో ఎదగాలంటే సాధకుల కృషిని ఆదర్శంగా తీసుకుంటే చాలదని అందుకు తగిన శ్రమ ఉండాలన్నారు. కార్యక్రమంలో



ప్రొఫెసర్ గోపాలన్ జగదీశ్ తదితరులు

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిప్పేస్వామి, డీన్ డాక్టర్ సర్వేశ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. విద్యార్థుల భరతనాట్య ప్రదర్శన సభికులను అలరించింది. ఇదే సందర్భంగా వివిధ విభాగాలలో సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం, బహుమతులు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి



అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

బంగారపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం కేవలం ఒకరోజుకే పరిమితం కాకుండా సార్థకత చేసేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి పేర్కొన్నారు. పట్టణంలో సాంఘిక సంక్షేమశాఖ, జాతీయ పండుగల ఆచరణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రజాస్వామ్య దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అంటే ప్రజలకోసం ఏర్పడిన ప్రభుత్వం అన్నారు. మన దేశ రాజ్యాంగం ప్రజాస్వామ్య దేశాలలో శ్రేష్ఠమైన రాజ్యాంగంగా గుర్తింపు పొందిందన్నారు. రాజ్యాంగ ఆశయాలపై అవగాహన కల్పించేలా ప్రభుత్వ రథయాత్ర ద్వారా జాగృతి నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలలో రాజ్యాంగ పీఠిక చదువుతున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, గ్రేడ్ 2 తహసీల్దార్ గాయత్రి, సాంఘిక సంక్షేమశాఖ సహాయక డైరెక్టర్ అంజలిదేవి, బీఈఓ శశికళ, వ్యవసాయశాఖ సహాయక డైరెక్టర్ ప్రతిభా, పురసభ అధ్యక్షులు గోవింద తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని అర్థవంతంగా ఆచరించారు.

బయటపడిన పురాతన శిలాశాసనం



లభించిన శిలాశాసనం

ముళబాగిలు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని పురాణ ప్రసిద్ధ ఆవణి క్షేత్రంలో పురాతన శిలాశాసనం ఇటీవల బయటపడింది. కళాశాల విద్యాశాఖ రిటైర్డు జాయింట్ డైరెక్టర్, చారిత్రక నిపుణుడు కేఆర్ నరసింహన్ నేతృత్వంలోని బృందం కొత్త శిలాశాసనం గురించిన విషయాలు వెల్లడించారు. ఆవణి ప్రాంతం పౌరాణిక, ధార్మిక ఇతిహాస రంగాలలో తనదైన గుర్తింపు కలిగిందని, ఇక్కడి ఆలయాలు రామాయణ మహాపురుషులకు అంకితం అయ్యాయన్నారు. వీటిని రామేశ్వర, లక్ష్మణేశ్వర, భరతేశ్వర, శత్రుఘ్నేశ్వరగా పిలవబడుతున్నాయని, ఇవేకాకుండా వానరసేన ప్రముఖుల పేరిట కూడా ఆలయాలు ఉన్నాయన్నారు. ఆవణిలో ఒకప్పుడు విభీషణుడి దేవాలయం ఉన్నట్టు కొత్త శాసనాలద్వారా తెలుస్తోందన్నారు. ప్రస్తుతం రామేశ్వరంలో మాత్రమే విభీషణుడి దేవాలయం ఉండగా ఇప్పుడు ఆవణిలోనూ విభీషణుడి దేవాలయం ఉందనే అంశం పరిశోధకులకు మరింత ఆసక్తి పెంచిందన్నారు. ఆవణి శివారులో అంతరగంగె అనే ప్రకృతి రమణీయ ప్రదేశంలో భూమి అడుగున ఉండే ఆలయంవద్ద తమిళ శాసనాలు ఉన్నాయి. ఇప్పటికే 30కుపైగా తమిళ శాసనాలు ఉండడం గమనార్హం. తాజాగా లభించిన శాసనంలో 14 వాక్యాలు ఉన్నాయి. రాజుపేరు లేనప్పటికీ అందులోని అంశాలవల్ల చోళరాజుల కాలంనాటిదిగా పరిగణిస్తున్నట్టు తెలిపారు. ఈ శాసనం 1090 నాటిదిగా అంచనా వేస్తున్నామన్నారు. విభీషణుడి ఎదుట నందాదీపం వెలిగించేందుకు 27 పశువులను ముగ్గురు బ్రాహ్మణులకు ఇచ్చారు. దానం ఇచ్చిన వ్యక్తిని సుందరన్, సూర్యన్ చక్రపాణి విక్రమచోళ మూవెండవేలన్‌గా పేర్కొన్నట్టు తెలిపారు. బృందంలో డాక్టర్ అరివు శివప్ప, కే ధనపాల్‌తోపాటు లెక్చరర్ గోపి, తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన పరిశోధకులు గోవిందరాజన్‌లు ఉన్నారు. ఇటువంటి పురాతన శాసనాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

రేపు రక్తదాన అమృత మహోత్సవం



మీడియా సమావేశంలో తేరాపంత్ పరిషత్ పదాధికారులు

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ, అఖిల భారతీయ తేరాపంత్ యువక పరిషత్ సంయుక్తంగా ఈనెల 17న బుధవారం ప్రపంచవ్యాప్తంగా రక్తదాన అమృతమహోత్సవం నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో తేరాపంత్ ఉపాధ్యక్షుడు పవన్ మండోత్, మాజీ అధ్యక్షులు విమల్ కటారియాలతోపాటు పలువురు మీడియాతో మాట్లాడారు. 75 దేశాలలో 7,500కుపైగా శిబిరాలు ఏర్పాటు చేసి రక్తం సేకరించనున్నామన్నారు. దేశంతోపాటు వివిధ దేశాలలో రక్తంకొరత ఉండరాదనే ఆశయంతో చైతన్యం కలిగిస్తున్నామన్నారు. బెంగళూరులో 46 చోట్ల శిబిరాలు ఉంటాయన్నారు. విజయనగర్ అబ్రహాం భవన్‌లో భారీస్థాయిలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. దక్షిణవిభాగం సంయోజకులు ప్రదీప్‌చొప్రా, వికాస్ బంతియా, విజయ్‌నవర్ జతీశ్, స్వరూప్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సామాజిక సేవా కార్యక్రమాలు



మీడియా సమావేశంలో హడి పిళ్ళప్ప, శ్రీధర్‌రెడ్డి తదితరులు

మహదేవపుర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ 75వ పుట్టినరోజును పురస్కరించుకుని మహదేవపుర నియోజకవర్గ వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ 200కుపైగా ప్రాంతాలలో సామాజికసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు బీజేపీ గ్రామీణ, హోబళి అధ్యక్షులు హరాడి పిళ్ళప్ప, శ్రీధర్‌రెడ్డిలు తెలిపారు. సోమవారం మారతహళ్ళిలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఉద్యానవనాలు, రోడ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛతా కార్యక్రమం, రక్తదాన శిబిరం ఉంటాయన్నారు. అదే రీతిన పచ్చదనం పెంచేలా మొక్కలు పంపిణీ చేసి నిర్దిష్ట ప్రదేశాలలో నాటుతున్నట్టు తెలిపారు. ప్రతి బూత్ పరిధిలో కార్యకర్తలు కనీసం పదులసంఖ్యలో మొక్కలు నాటుతారన్నారు. ఆరోగ్య శిబిరాలు నిర్వహించి బీపీ, షుగర్‌తోపాటు ఇతరత్రా పరీక్షలు ఉచితంగా ఉంటాయన్నారు. పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, బట్టలతోపాటు పౌష్టికాహారం పంపిణీ చేస్తామన్నారు. పేదలకు, పౌరకార్మికులకు నిత్యావసర కిట్‌లు అందచేస్తామన్నారు. గోశాలలకు దాణా సమకూర్చి అవసరమైన ఆర్థికసాయం ఇవ్వదలిచనట్టు తెలిపారు. సామాజిక కార్య క్రమాలలో ప్రజలంతా భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కుమార్, నాగరాజ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు.. విశ్వేశ్వరయ్య

» ఇంజనీర్స్ డేలో వక్తలు




దొడ్డబళ్ళాపురలో ఇంజనీర్స్ డేలో పాల్గొన్న ప్రముఖులు

దొడ్డబళ్ళాపుర, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): దూరదృష్టి, ప్రజాక్షేమం ఆకాంక్షించిన భారతరత్న సర్ ఎం విశ్వేశ్వరయ్య ఆదర్శప్రాయులని వక్తలు పేర్కొన్నారు. దొడ్డబళ్ళాపురలోని సర్ ఎంవీ జయంతిని ఆర్ఎల్ జాలప్ప ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, లయన్స్‌క్లబ్ ఆర్ఎల్‌జేఐ సంయుక్తంగా సోమవారం నిర్వహించారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి దేవరాజ్ అరసు విద్యాసంస్థ ఉపాధ్యక్షుడు జే రాజేంద్ర పుష్పాంజలి ఘటించారు. అనంతరం రాజేంద్ర మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల క్షేమంకోసం విశ్వేశ్వరయ్య కృషి చేశారన్నారు. ముద్దేనహళ్ళిలో జన్మించిన ఆయన ప్రపంచం మెచ్చే ఇంజనీర్‌గా నిలిచారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కార్తిక్, డీన్ శ్రీనివాసరెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కేఆర్ రవికిరణ్ తదితరులు ప్రసంగించారు. ఘాటి సుబ్రమణ్య పికప్ డ్యాం, జక్కలమడుగు పాత చిన్న ఆనకట్టను విశ్వేశ్వరయ్య నిర్మించారని, కొంగాడియప్ప సేవలు కూడా ఉన్నాయని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ ఇంజనీర్ రమేశ్‌కుమార్, జూనియర్ ఇంజనీర్ మారుతిలను సత్కరించారు.

పట్టు రైతుల సంక్షేమమే లక్ష్యం

» సేవా సహకార సంఘం అధ్యక్షుడు నందకుమార్

దొమ్మసంద్ర, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టు పెంపకందారులు, రైతుల సంక్షేమమే సేవాసహకార సంఘం అధ్యక్షుడు నందకుమార్ అభిప్రాయపడ్డారు. ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళి సోంపుర గేట్ సమీపాన గ్రాండ్‌ప్యాలెస్‌లో ఆదివారం ఏర్పాటైన పట్టు పెంపకందారులు, రైతుల సహకారసంఘం 49వ వార్షిక సర్వసభ్యుల సమావేశం జరిగింది. నందకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం సంఘం రూ.4.52 కోట్ల లాభాలు గడించిందన్నారు. రానున్న రోజుల్లో సంఘం మరింత సమర్థవంతంగా, రైతుల స్నేహిగా కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. సంఘం ఉపాధ్య క్షుడు సతీశ్‌కుమార్ మాట్లాడుతూ సంఘానికి ఐదు ప్రాంతాలలోశాఖలు ఉన్నాయని సంఘం సమాచారాన్ని ఎప్పటికప్పుడు వాట్సప్ ద్వారా అందచేస్తున్నట్టు తెలిపారు. లాభం రూ.4.52కోట్లలో సంఘం సభ్యులకు 20శాతం డివిడెండ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రతి సంవత్సరం ప్రతిభా పురస్కారాలలో తలా రూ.5వేలు ప్రదానం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం సీఈఓ నంజప్ప, డైరెక్టర్ విశ్వనాథ్, పిల్లారెడ్డి, భ్రమరేశ్, సుబ్బారెడ్డి, హరీశ్‌బాబు, వెంకటేశ్, పవన్‌కుమార్, శ్వేతా, ఆశాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	10.333	23,314
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,179	21,358
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77



విశ్వేశ్వరయ్యకు నివాళి అర్పిస్తున్న ఓఆర్‌కే రెడ్డి

విశ్వేశ్వరయ్య సేవలు మరువలేనివి

● టీబీ బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి

కంప్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశంలోనే గొప్ప ఇంజనీర్‌గా పేరు సంపాదించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు మరువలేనివని తుంగభద్ర జలాశయం కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి అన్నారు. సోమవారం ఇంజనీర్స్ డే సందర్భంగా హోస్పేటలో తుంగభద్ర జలాశయం కార్యాలయం వద్ద విశ్వేశ్వరయ్యకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఇంజనీరు విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని, మనం చేసే పనులే గుర్తింపునిస్తాయన్నారు. కార్యక్రమంలో సహాయక కార్యదర్శి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, జ్ఞానేశ్వర్, కృష్ణకుమార్, ప్రసన్న, రామాంజినేయులు, శ్రీనివాసులు, సోమశేఖర్, రవి కుమార్, కిరణ్ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాలో రాణించిన పూజ



పూజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కంప్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 7వ తరగతి చదువుతున్న ఎస్ పూజ కల్బుర్గి విభాగం సోమవారం జరిగిన దసరా క్రీడా ఉత్సవాల్లో యోగా పోటీలు రాణించి ప్రథమస్థానం దక్కించుకుని ముఖ్యమంత్రి పథకానికి ఎంపిక య్యింది. పూజ కంప్లిలో శ్యామల యోగ ఉపాధ్యాయురాలితో శిక్షణ పొంది ఎన్నో పతకాలు సాధించింది. దసరా ఉత్సవాలు క్రీడల్లో పూజ రాణించి ప్రథమ స్థానం దక్కించుకున్నందుకు తోటి విద్యార్థులు, తల్లి దండ్రులు అభినందన తెలిపారు.

ఎరువుల పంపిణీ

గుడిబండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనకుంట, కొంకల్లు రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు వ్యవసాయ అధికారి వీరనరేష్, టీడీపీ నాయకులు ఎరువులను పంపిణీ చేశారు. మద్దనకుంట రైతు సేవా కేంద్రంలో రైతులకు 140 బస్తాలు, కొంకల్లు రైతు సేవా కేంద్రంలో 140 బస్తాలు పంపిణీ చేశారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి

● అందరి మేలు కోసమే చట్టాల రూపకల్పన ● ప్రజాస్వామ్య దినోత్సవంలో కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలని, చట్టాలు అందరి కోసమే తయారు చేశారని ఎవ్వరూ దిక్కరించరాదని జిల్లాకలెక్టర్ నాగేంద్రప్రసాద్ అన్నారు. జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, సాంఘిక సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'నాఓటు మన హక్కు' నినాదంతో నగరంలోని దొడ్డనగౌడ రంగమందిరంలో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవంలో ఆయన అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతతరం వర్తమానంలో జరుగుతున్న సంఘటనలను గమనించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ వ్యవస్థను, చట్టాల పరిపూర్ణతపై యువతకు అవగాహన ఉండాలన్నారు. కాబట్టి లోతైన అధ్యయనాలు నిర్వహించాలని అన్నారు. స్వాతంత్ర్యం తరువాత దేశ అభివృద్ధి ,తదుపరి తరం భవిష్యత్తు కోసం, భారతదేశానికి అత్యుత్తమ పాలనా వ్యవస్థను అందించడానికి అంబేద్కర్ గణతంత్ర,ప్రజాస్వామ్యం అనే ఆలోచనను రూపొందించారని దానిని రాజ్యాంగంలో అమలు చేశారని, ఇలాంటి పాలనను ఏర్పాటు చేశారని, ఆ వ్యవస్థను అంగీకరించారని,దానికి తనను తాను అంకితం చేసుకున్నారని ఆయన అన్నారు. ఏదేశం అభివృద్ధి అయిన దాని పరిపాలనా వ్యవస్థపై ఆధారపడి ఉంటుంది. ఇంత మంచి పరిపాలనా వ్యవస్థ మనదేశంలో కనిపిస్తుందని ఆయన అన్నారు. భారతదేశం ప్రపంచంలోనే రెండవ అత్యధిక జనాభా కలిగిన దేశం అని, ఇది ప్రజాస్వామ్య దేశం, చట్టాలను ప్రజాప్రతినిధులు తయారు చేస్తారన్నారు. అందుకే ప్రపంచం భారతదేశ అభివృద్ధి వైపు చూస్తోందన్నారు. జిల్లాంపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్ మాట్లాడుతూ ప్రజల ఆర్థిక సామాజిక జీవితాల్లో ఎటువంటి రక్తపాతం లేకుండా విప్లవాత్మక మార్పును తీసుకురావడం ప్రజాస్వామ్య ప్రభుత్వం తోనే సాధ్యమన్నారు. అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం సందర్భంగా జిల్లాపరిపాలనా భవనం నుండి సైకిల్ ర్యాలీ జరిగింది. ర్యాలీని జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ గడిగ చెన్నప్పసర్కిల్, కనకదుర్గమ్మఆలయం, ఎస్పీ సర్కిల్, గవియప్ప సర్కిల్ మీదుగా జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిర వేదిక వద్దకు చేరుకుంది. ఈసందర్భంగా చిదానందప్ప, వెనుకబడిన సంక్షేమ అధికారి జాలాలప్ప, రామకృష్ణ నాయక్, డీడీపి నాగలింగయ్యస్వామి, వివిధ సంఘాలు, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీలో ఉద్యోగులు, నాయకులు,

రూ.ఐదు లక్షల పరిహారం అందజేత



ప్రవీణ్ తల్లికి చెక్కు అందజేస్తున్న మేయర్ నందీష్

బళ్లారిరూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల హాసన్‌లో వినాయక నిమజ్జనం సమయంలో కంటెయినర్ ఢీ కొని 9మంది మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. అందులో బళ్లారి నగరానికి చెందిన ప్రవీణ్ అనే బీటెక్ విద్యార్థి మృత్యువాత పడ్డాడు. నగరంలోని నాగలకేరి ప్రాంతానికి చెందిన ప్రవీణ్ కుమార్ తల్లికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. ఐదు లక్షల నష్ట పరిహారాన్ని సోమవారం బళ్లారి మేయర్ నందీష్ స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళ, గోవిందు, జగన్నాథ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉప్పొంగి ప్రవహిస్తున్న దరోజీ చెరువు

కంప్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు చెరువులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. సండూరు తాలుకాలో గత దాదాపు అన్ని చెరువుల్లో పుష్కలంగా నీరు ప్రవహిస్తోంది. గతంలో ఎన్నడూలేని విధంగా చెరువులు నిండి ప్రవహిస్తుండటంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



మరువ పారుతున్న దరోజీ చెరువు

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలి

● ఎమ్మెల్యే బీఎం నాగరాజు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ఎమ్మెల్యే నాగరాజు

కంప్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చి ఆరోగ్యంతో పాటు, విద్యావంతులుగా తీర్చిదిద్దాలని సిరుగుప్పనియోజకవర్గ ఎమ్మెల్యే బీఎం నాగరాజు అన్నారు. సిరిగేరి సమీపంలోని సిద్దరాంపురం గ్రామంలో రూ.20 లక్షలు కేకేఆర్‌డీపీ నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థుల సౌకర్యార్ధ నూతన పాఠశాలను, హాస్టల్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షుడు గంటి నాగరాజు, ఉపాధ్యక్షులు ముద్దే ఈరమ్మ, పీడీవో లీలావతి, మాజీ గ్రామ పంచాయతీ అధ్యక్షులు సిద్దన్నగౌడ, పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్షురాలు నిర్మిత, సీడీపీవో ప్రదీప్, విద్యుత్ శాఖ అధికారి షెక్షావలీ, నాగరాజు స్వామి, పంచాయతీ సభ్యులు, గ్రామస్తులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'భారతీయ బ్రాహ్మణులు అని రాయించాలి'

సిరుగుప్ప, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తాలుకా వ్యాప్తంగా బ్రాహ్మణులు కులగణన సర్వేలో ఉపకులాలను పక్కనపెట్టి భారతీయ బ్రాహ్మణులని రాయించాలని బ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జోయస్ శ్రీనివాసమూర్తి బ్రాహ్మణులకు పిలుపునిచ్చారు. సోమవారం విలేకరులతో బ్రాహ్మణుల సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసమూర్తి జోయస్ మాట్లాడుతూ ఆర్థికంగా, రాజకీయంగా, సాంఘీకంగా బ్రాహ్మణులు ముందుకెళ్లాలంటే విప్ర కులం బదులుగా బ్రాహ్మణులని సర్వేలో రాయించాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న గంగ మత నాయకులు

కులగణనలో మత్స్యకారులుగా చేర్చాలి

● గంగ మతస్థుల డిమాండ్

బళ్లారి సిటీ,సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కుల గణనలో గంగ సమాజానికి చెందిన 37 ఉపకులాలను కుల కాలమ్‌లో మత్స్యకారులుగా చేర్చాలని, వారి ఉప కాలంలో వారు అనుసరించిన సంస్కృతిని రాసి సహకరించాలని గంగామతస్త సంఘం అధ్యక్షుడు మౌలాలి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని పత్రికా భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు 14-15 లక్షల జనాభా ఉన్న గంగమత అనుచరులు రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరుగా పిలుస్తున్నారన్నారు. తీర ప్రాంతంలో మొగవీర, హైదారాబాద్ కర్ణాటకాలోని బెస్త, కోలి, అంబిగ, ఉత్తర కర్ణాటకలోని బారీక వంటి దాదాపు 37ఉప కులాలు ఉన్నాయన్నారు. వారందరినీ ఏకం చేసి గంగా సమాజాన్ని ఒకటిగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈసందర్భంగా అన్ని గంగా అనుచరులు , బారికర్లు, బెస్తలు, ఇతర ఉప కులాలను కుల కాలమ్‌లో బెస్తలుగా జాబితాలో రాయించాలని ఆయన పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో బారిక సంఘం నాయకులు పంపాపాటి, హులుగప్ప, మోహన్, శివశంకర్, లింగప్ప, దాక్షాయిణి, ఆనంద్ హెగ్డే, బసవరాజ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లలో న్యాయం చేయాలి

● కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సంచార జాతుల లేఖ



పోస్టాఫీసు వద్ద లేఖలు చూపుతున్న సంచారజాతి నాయకులు

గంగావతి రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ అధికారి ప్రతినిధి రాహుల్‌గాంధీకి నగరంలోని సంచార జాతి నాయకులు లేఖలు పంపారు. ప్రధాన పోస్టాఫీస్ వద్ద సోమవారం సంచార జాతుల పోరాట కమిటీ తాలూకా అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ మన రాష్ట్రం మొత్తం ప్రతి జిల్లా, తాలూకా గ్రామం నుండి సుమారు 5000 లేఖలు పంపామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు తీవ్ర అన్యాయం చేసిందిని, తమకు దక్కాల్సిన ఒక శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా మోసం చేసిందని, 79 సంవత్సరాలుగా వీధి చెత్తలా బతికిన తాము హక్కుల కోసం పోరాడుతున్నామన్నారు. అక్టోబరు 2న గాంధీ జయంతి రోడు దాదాపు 1000మంది సంచార నాయకులతో కలిసి మిమ్మల్ని డిల్లీకి వెళ్తామన్నారు. ఈసందర్భంగా దళిత నాయకుడు మరిస్వామి బరగూరు, రేణుకమ్మ, బుడగ జంగం నాయకుడు అశ్వరామన్న, నాగరాజ్, కుమార్, బంగారప్ప ,వెంకటేశ్, సింధోల్ యల్లప్ప, మంజునాథ చెన్నదాస్, నాగరాజు తదితరులున్నారు.

అంతర్గత రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నిరసన



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సంచార జాతుల ప్రతినిధులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలో అంతర్గత రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా నారాయణరావు పార్కునుంచి ర్యాలీ నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ కార్యాలయం చేరుకుని లంబాని, భోవి సమాజం,కొరమ,కొరచ నాయకులు నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతి పత్రం అంజేశారు. ఈసందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ తమకు 6శాతం నుంచి 7శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, సంచార జాతులకు ప్రత్యేక స్థానం ఇవ్వాలన్నారు. సిద్దరామయ్య ప్రభుత్వం 63కులాలకు 5శాతం మాత్రమే రిజర్వేషన్లు ఇవ్వంతో తమకు అన్యాయం జరిగిందన్నారు. ఈసందర్భంగా లంబాణి సంఘం నాయకులు గోపినాయక్, రామానాయక్, భోవి సమాజ నాయకులు బండిహట్టి మహేశ్, భోవి సమాజం అధ్యక్షుడు రామాంజనేయులు, టి.మల్లేశప్ప, కొరచ కురమ సమాజ నాయకులు హనుమంతప్ప, రమణప్ప భజంత్రీ, శంకరబండె వెంకట్రాం తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎం నాగరాజ

సిరుగుప్ప, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రూ. కోటి వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు భూమిపూజ చేశారు. సోమవారం తాలుకా పరిధిలోని అగసనూరు గ్రామంలో గ్రామీణ ప్రాంతాల రోడ్లకు శ్రీకారం చుట్టారు. నాణ్యతగా పనులు చేపట్టాలని ఎమ్మెల్యే కాంట్రాక్టర్లకు సూచించారు. కేకేఆర్‌డీజీ నిధుల కింద ఈ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీడబ్ల్యూడీ ఏఈఈ చెన్నన్న గౌడ, ఇంజనీర్ షరీఫ్, మాజీ తాలుకా పంచాయతీ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు హేమంత్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సురేష్ రెడ్డి, గ్రామ పంచాయతీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం కార్యదర్శిగా మంజునాథ్



మంజునాథ్‌కు ఉత్తర్వు అందజేస్తున్న అధ్యక్షుడు కందగట్ల స్వామి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అఖిల భారత పద్మశాలి సంఘం నూతన కార్యదర్శిగా బళ్లారికి చెందిన అవ్వారు మంజునాథ్ నియమితులయ్యారు. మంజునాథ్‌ను నూతన కార్యదర్శిగా నియమిస్తూ అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందకట్ల స్వామి పద్మశాలి ఉత్తర్వులు జారీ చేశారు. మంజునాథ్ బళ్లారి జిల్లావాణిజ్య పరిశ్రమల మండలికి సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా, బళ్లారి జిల్లా పద్మశాలి అసోసియేషన్ అధ్యక్షుడిగా, వివిధ సంఘాల సంస్థలకు ఆఫీస్ బేరర్‌గా పనిచేస్తున్నారు.

హోసూరు జోన్



ఇంజనీర్స్ డేలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఘనంగా ఇంజనీర్స్ డే

హోసూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోన అడియమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్ల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పుష్పాలు సమర్పించారు. ఎల్కెమ్ ఆటోమొబైల్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎల్‌కేఎం అది ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యం పెంపెంపొందించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ భావి ఇంజనీర్లకు విశ్వేశ్వరయ్య పునాదిలాంటివారని, వారి ఆశయాలతో ముందుకు సాగాలన్నారు. ఫ్యాక్టరీ సలహాదారుడు డాక్టర్ ధనశేఖరన్, డీన్ అరువిడైనంబి, అధ్యాపకులు డాక్టర్ మేనకాదేవి తదితరులు పాల్గొన్నారు.

పీఎంకే కార్యకర్తల సంబరాలు

హోసూరు (కృష్ణగిరి), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పీఎంకే అధ్యక్షుడిగా అన్బుమణిని ఎన్నికలసంఘం గుర్తించడంతో పార్టీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఈ విషయాన్ని ప్రకటించారు. మామిడికాయ గుర్తును కేటాయించే అధికారం, వర్కర్స్ పార్టీ నాయకుడి సహా అన్ని అధికారాలు డాక్టర్ అన్బుమణికి ఉన్నాయని ప్రకటించారు. పీఎంకే జనరల్ బాడీ మీటింగ్‌లో డాక్టర్ అన్బుమణిగా పార్టీ కార్యవర్గం ఎన్నుకోగా తాజాగా సోమవారం ఎన్నికల సంఘం గుర్తించిందన్నారు. 2026 ఆగస్టు 1వరకు ఆయన అదేహోదాలో కొనసాగుతారని పార్టీకి చెందిన బాలు చెన్నైలో మీడియాకు తెలిపారు. ఎన్నికల సంఘం ప్రకటనతో కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు మిఠాయిలు పంపిణీ చేసి, బాణాసంచా కాల్చారు. పీఎంకే కృష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి గోవిందరాజ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసన్ ఇతర పదాధికారులు పాల్గొన్నారు.



మిఠాయిలు పంపిణీ చేస్తున్న కార్యకర్తలు

ఎమ్మెల్యే నాగేంద్ర జన్మదినం సందర్భంగా అభిమానుల రక్తదానం



రక్తదాతలకు హెల్మెట్ అందజేస్తున్న ఎంజీ కనక



కేక్ కట్ చేస్తున్న అభిమానులు

బళ్లారిరూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బళ్లారి రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర పుట్టినరోజు సందర్భంగా అభిమానులు రక్తదానం చేశారు. సోమవారం నగరంలోని సత్యనారాయణ పేట ఏరియా కూల్ కార్నర్ సమీపంలో అహిందా సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యువకులు పెద్దఎత్తున రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంజీ కనక హెల్మెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అహిందా సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మారుతి, సంఘం సభ్యులు నాగరాజు గంగాధర, మల్లికార్జున, అరుణ్, వన్నెల్లి, మల్లికార్జున, నూర్, సునీల్, ఇంతియాజ్, క్రాంతికుమార్, వన్నూరు స్వామి, బసవరాజు పలు సంఘం పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభిమానుల చండీయాగం

నగరంలోని నెహ్రూ కాలనీలో నాగేంద్ర నివాసంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చండీయాగం నిర్వహించారు. ఈ పూజల్లో పండితులతో పాటు ఈ పూజల్లో నగరంతో పాటు వివిధ గ్రామాల నుండి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నగర ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి యాగంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిద్దంపల్లి తిమ్మనగౌడ, లింగ దేవనహళ్లి గోవర్దన్‌రెడ్డి, మోకా అన్న నాగరాజు, ఎర్రగుడి ముద్దమల్లయ్య, రాయపురం మర్రి స్వామి, మీనళ్లి వెంకటేష్, వై కగ్గల్లు సముత్‌రాజ్, బెనకల్లు బసవరాజు, సంగనకల్ విజయ్ కుమార్, ఆత్మమిత్ర భాష నాయకులు పాల్గొన్నారు.



యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే నారాభరత్ రెడ్డి

తీవ్ర రక్తస్రావంతో గర్భిణి మృతి

రాయచూరు సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పురిటి నొప్పులు పడుతూ కాన్పు కోసం రిమ్స్ ఆస్పత్రిలో చేరిన మహిళ ఒకరు తీవ్ర రక్త స్రావంతో మృత్యువాత పడింది. రెండు రోజుల క్రితం లింగసుగూరు తాలూకా చిక్క హెసరూరు గ్రామానికి చెందిన ఉవమ్మను పురిటి నొప్పులు అధికం కావడంతో లింగసుగూరు తాలూకా ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్చారు. అక్కడ పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం ఆమెను జిల్లాలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కూడా చికిత్స ఫలించకపోవడంతో వైద్యులు ఆమెను బెంగళూరుకు తీసుకెళ్లామని సూచించారు. ఆదివారం రాత్రి ఉవమ్మను బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో తుది శ్వాసవిడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



ఉవమ్మ (ఫైల్)

ఎమ్మెల్యేలు మూకుమ్మడి రాజీనామా చేయాలి

పావగడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు కులవ్యవస్థపైనే ఆధారపడి ఉన్నాయని, కులానికి ప్రాధాన్యమిస్తే ఆ ప్రాంత ఎమ్మెల్యేలు చేయాలని దళిత స్వాభిమాన ఐక్యత రాష్ట్ర కన్వీనర్ కేశవమూర్తి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మధుగిరి తాలూకా పోలేనహళ్లిలో ఆనంద్ అనే వ్యక్తిని హత్యచేసిన ఘటన, పావగడలోని బెళ్లిబెట్టు గ్రామంలో హనుమంతరాయప్ప అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. 24వ తేదీన మధుగిరిలోని జిల్లా వ్యాప్తంగా దళితుల దండోర మోగించడానికి పెద్దఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. హత్య జరిగిన కుటుంబాలకు ఎమెమ్మెల్యేగాని, అధికారులుగాని వారి కుటుంబాలను పరామర్శించడంగాని తెలియజేయకపోవడం కుల వ్యవస్థ నిర్మూలనకు పాటుపడే వ్యక్తిత్వంగాని వారిలో లేకపోవడమే దీనికి నిదర్శనమని జిల్లా కన్వీనర్ సిద్దార్థ రంగయ్య, తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మేఘరాజ్, శంకరప్ప, రామన్న, కన్వీనర్లు హనుమంతరాయ, లింగన్న, మంజన్న, అజిత్ పాల్గొన్నారు.